# మర్యాదలు

శ్రీ జూనూతల వేంకటరామమూర్తి

'చదువుకున్నందుకూ, ఉద్యోగాలు వెలిగిస్తున్నందుకూ మనం ఒకళ్ళకయినా కాస్త సాయం చేస్తే దేశంలో ఇంతింత లావాటి సమస్యలు ఉత్పన్నం కావేమో! వచ్చినా సులభంగా తేలిపోతవి!'

'ఏమో!' పరధ్యానంలో అనేశాను.

'నేనెంతటి ముఖ్య విషయం చెబుతున్నానో నీవు అర్థం చేసుకునే స్థితిలో బొత్తిగా లేవని నమ్మలేను. కట్నాలు ఇచ్చుకోలేక పెండ్లికి వాయిదా పడుతూంటే, చాటున కన్నీళ్లు తుడుచుకుంటూ ఎంతగా గిలగిల్లాడుతూ, ఎందరు తపించిపోతూ మగజాతిని శపించి వేస్తున్నారో ఎప్పుడేనా ఊహించడం జరిగిందా? నేను కండ్లారా చూశాను!'

'లేదు!' అంటూ కండ్లు వాడివేపుకు తిప్పాను. నందకుమార్ కండ్లలో ఎఱ్ఱటి జీరలు - మామూలుగా ఉండేవే కనిపించాయి. కండ్లు ఎఱ్ఱటి జీరలతో ఉంటం భాగ్యచిహ్నమని వాడు తరచు అనేవాడు. కుమార్ మళ్ళీ మొదలెత్తాడు, 'కనీసం ప్రతియువకుడు కట్నం తీసుకోనని ఎందుకు తీర్మానం చేసుకోరాదూ?

'ఈ విషయంలో ఒక చట్టంకూడా ఉంది. ఇది చాల పాతపాట! ఇంతకూ నీవు తీసుకోడం జరిగిందా?'

'ఆఁ మనసా నిశ్చయించాను. రేపు ఇరవై రెండు నా పెండ్లి!' అనేసి నందకుమార్, పిలుస్తున్నా వినక వెళ్లిపోయాడు.

నేను ఆశ్చర్యంతో కూర్చుండి పోయాను!

అతి మామూలుగా వాడి పెండ్లి జరిగిపోయింది, కాబట్టి ఆర్భాటంగా నేనూ చెప్పడంలేదు. పసుపు డాగులయిన బట్టలతో, శిరస్సునుండి బియ్యం రాలుతూంటే చిరునవ్వులతో సరాసరి నా దగ్గరకు వచ్చి, 'ఎల్లా ఉందిరా?' అన్నాడు నందకుమార్.

'ఏమిటి'

'నా పెళ్లాం!' వాడి ముఖంలో గర్వం, హోదా తాలూకు కవళికలు మెరుస్తున్నాయి!

'నీకు సరిపోతుంది!'

ఇంతలో వాడి పెద్ద బావమరది గబుక్కున వచ్చి 'ముఖ్యంగా మిమ్ముల అభినందిస్తున్నాను. మీలాంటి మిత్రబృందం ఉంటంవల్లనే సంస్కరణాభిలాషలూ, స్వేచ్ఛా ప్రయత్నమూ కలుగుతుంటాయి. ఇల్లాంటి పుణ్యపురుషుని చూసినప్పుడు నా కండ్లు చెమ్మగిల్లుతుంటాయి వీరిని నేనేమని అభినందించేది?'

'చేసిన మెప్పు చాలదూ? కొరవా, సరవా మీ చెల్లెలు చూసుకోగలదు!' అంటూ పైకి నేను అనలేదు.

నందకుమార్ ఉదాత్తమైన అవలోకనాలు మావేపునుండీ లోపల వేపుకు ప్రసరించాయి. నేనూ అటే చూస్తున్నాను కాబట్టి, మెరుపులా తళుక్కున మెరిసి పోయిన వాడి మరదలు కనిపించింది.

'మేము చూడండి ఎంతో కష్టపడాం! ఇవాళ ఒకమోస్తరుగా నుంచోగలిగాము. ఇది సంతోషంగానే ఉంది. మా నాన్న మాకోసం ఏమీ మిగల్చలేక పోయినా, ఇద్దరు పెండ్లాడాల్సిన చెల్లెళ్ళను వదలి పోయాడు. ఎంత కష్టమో ఆలోచించండి? పొటకూ, బట్టకూ జరుపుకోడమే బ్రహ్మాండమవుతూంటే, ఇంకా వేలకువేలు క్రుమ్మరించడం సామాన్యమా?' అని అతడు ఒక నిముషం కూడా విరామం తీసుకోక, 'నందకుమార్ విశాలహృదయుడు కావడంవల్లనే, ఎవళ్ళకెంత అనిష్టమైనా తన ఆశయాన్ని చక్కగా ప్రదర్శించి కృతార్థుడైనాడు!' అని అతడు వెళ్ళి పోయాడు.

అతడి ధోరణీ, తత్త్వమూ నేను అప్పుడు బాగా అర్థం చేసుకోలేకపోయాను.

'మంచి బావమరిది నే సంపాదించావ్!'

'ఆయనకేంలోయ్! గజిటెడ్ రాంకులేదనే కానీ, సెంట్రల్ లో అంత జీతంవచ్చే ఉద్యోగం!'

'ఆయన తమ్ముడో!'

'రీసెర్చి చేస్తున్నాడు!'

'అదృష్టమే! చాల బావుంది!'

'ఎక్కడ సమ్మంధం చెప్పరా! భగవంతుడు ఎక్కడెక్కడికి గీచి, ముడివేస్తుంటాడో తెలీదు. మన ఊరెక్కడా వీళ్ళెక్కడా?'

'ఔను!'

వాడూ వెళిపోయాడు. పెండ్లిలు చాల సందడితో ఉంది, కానీ నేను ఎదురు చూస్తున్న వ్యక్తి మాత్రం అవపడలేదు. చాలసేపటినుండి ఎవళ్ళతో మాటాడుతున్నా ఆ వేపుకు చూపులుంచి కూర్చున్నాను.

నందకుమార్ చెల్లెలు ఇటు వస్తోంది. ఆమెను ఆపి, 'మీ నాన్న ఎక్కడా?' అన్నాను.

'మీకు తెలీదా? ఆయన రాలేదు!'

'ఏం?'

ఉదాసీనంగా నవ్వి హేమ వెళ్ళిపోయింది.

ఆయన రాకండానె వీడు పెండ్లాడేస్తున్నాడా? ఇంత చేసిన ఆయన, కొడుకు ఒక ఇంటివాడు అవుతూంటె రాకపోవడం కారణం?

మౌనంతో అక్కడనుండీ లేచి ఇవతలకు వచ్చాను. స్నేహితులంతా ధూమపాన పారవశ్యంతో, చతుర్ముఖ పారాయణంలో మునిగి తేలుతున్నారు. వాళ్లముందు లక్ష్మీదేవి కాళ్లిగజ్జెల మల్లె డబ్బులు గలగల్లాడుతున్నాయి!

'ఒరేయి! వాడు తప్పకపోతున్నాడురా! వాడిని పట్టుకరండిరా!' అంటూ కేక వేశాడు సుబ్రహ్మణ్యం!

'రా! నాయనా! రా! ఓ పీకు పీకి, ఓ చేయి కలిపి, కాసిని డబ్బులు ఇచ్చిపోరా తండ్రీ!' అంటూ హృదయ పూర్వకంగా మధుసూదన్ ఆహ్వానించాడు.

చిరునవ్వుతో వాళ్లను వదలించుకుని గబగబా అడుగులు సాగించాను!

మండువాలో నాగరాజు సిగరెట్ తాగుతూన్నాడు.

'ఏమోయ్! మీ నాన్న రాలేదూ?'

'ఆఁ'

'ఎందుకని?'

'ఈ పెండ్లి ఆయనకు ఇష్టంలేదు. నందూకు మరో సమ్మంధం నిశ్చయం చేసుకున్నాడు. వాళ్ళు నాలుగువేలు ఇస్తామనీ, సొమ్ము పట్టింపు లేదని చెప్పారు. ఆ డబ్బుతో హేమను వదలించుకోవాలని సిద్ధం చేసుకుని కూర్చున్నాడు. కానీ ఈయనగారు ముందే బుక్ చేసుకుని పెళ్ళికి సిద్ధమైనాడు. అంతా అయిపోయాక నాన్నకు తెలిసింది. నలుగురిలో ఇవాళ ఆయన మొగం ఎత్తుకోలేక పోతున్నాడు. ఎవడికేం? ఎవడిసుఖం వాడికి! అందరినీ పగ చేసుకుని ఏం పొందుతాడో కాలం తేల్చవలసిన రహస్యం!' అంటూ బుసలుకొడుతూ సిగరెట్టును నేలకేసి కొట్టి బూటు కాలితో రాచి పొడిపొడి చేశాడు!

'నీవూ కోపంగా ఉన్నావన్న మాట! మరి నీకూ పెండ్లీడు వచ్చిందనుకుంటాను. నీవు ఆమెను పెండ్లాడి మీ నాన్న వ్రాలిపోయిన తలను పైకెత్తే ప్రయత్నం చేయకూడదూ!'

'ఇప్పుడల్లా పెండ్లి చేసుకోదల్చలేదు!'

'ఏ! పెండ్లి చేసుకునే తలంపుందా?'

'ఆఁ!'

'మరి ఎప్పుడయితే నేం? వయస్సు నీకూ వచ్చేసింది కూడా! మీ నాన్న కోసమూ, హేమ కోసమూ, మీ అన్న చేయలేని పని నీవెందుకు చేయకూడదోయ్?'

'చదువు పూర్తి కావాలి!' అంటూ నాగరాజు దూసుకుపోయాడు.

కోపంతో వెళుతున్న నాగరాజు వేపు చూస్తూ నందకుమార్‌కు అత్తింటి తరఫున ఎంతో బలమైన ఆలంబనము చిక్కకపోతే ఇందరికి అనిష్టమయిన పెండ్లి చేసుకోడని అనుకున్నాను.

* * *

స్నేహితమంతా ఒకచోట ఉన్నప్పుడే! ఉద్యోగం పేరిట నేల నాలుగు చెరగులా ప్రాకిపోయిన స్నేహితులగురించి కొంచెం సేపయినా అనుకునేందుకు తీరిక ఈ జీవితంలో చిక్కడంలేదు. వయస్సు పెంచుకుంటూ, ఆయువు తగించుకుంటూ, దిక్కు తెలీక బ్రతకడం వల్ల పొందబోయే లాభం యోచించుకునే ధైర్యమూ, ఓపికా లేక ముందుకుపోతూ పండిపోతున్నాను.

హఠాత్తుగ నందకుమార్ వచ్చాడు. ఎఱ్ఱటి ఎండలో పిడుగుపడితే ఎంత ఆశ్చర్యపోతామో, అంతే ఆశ్చర్యపోయాను వాడిని చూసి! వాడు మాటలు మానివేసి చూపుల్లో దీనత్వం చిందిస్తూ కూర్చున్నాడు. అంత కాలానికి కలుసుకున్న మేము మాటా-మంతి

లేక రాతిబొమ్మల్లా కూర్చున్నాము. వాడి ముఖంలోకి చూస్తూ నేను సంభాషణాశక్తి గోల్పోయాను.

వాడిముఖంలో ఆరిపోబోతున్న దీపకళిక మల్లె మలినకాంతులు వ్యాపించి ఉన్నాయి.

చాలసేపటికి తెప్పరిల్లి, 'ఏమిటి ఇల్లాఅయావు' అన్నాను.

'ఎల్లా అయ్యాననూ? బాగానే వుండాలె! ఏం నీకు బాగా జరుగుతోందా? నేను జీవితంలో ఓడిపోయాను. నాకు బంధువులు ఎందుకు లెమ్మనుకున్నాను ఇవాళ వాళ్లకోసం పిచ్చివాడి నవుతున్నాను.'

'అంటే?'

'ఇంక నేను తండ్రిని కాబోతున్నాను! అంటే రెండు జీవితాల గరిష్ఠ సమ్మర్దం నామీద ఉందన్నమాట! అన్నట్లు, నీవింకా పెండ్లిచేసుకోలేదేం?' అని మ్లానంగా నవ్వాడు నందకుమార్!

'చేసుకోవాలెనా?'

'నందకుమార్ గంభీరంగా చూస్తూ అన్నాడు. 'అది కేవలం వ్యక్తిగతమైందే కాదు. మునుపు నేను పెండ్లిని వ్యక్తిగతమైందనే తలచాను. కానీ నిజం కాదు. నలుగురకూ, ముఖ్యంగా కుటుంబానికంతా సంబంధించిన విషయం అది!'

'అంటే?'

'నీ విషయం చూడరాదూ? వీళ్ళంతా శత్రువులుగా ఎందుకు అయ్యారంటావు? కేవలం పెండ్లిని నా సొంతవిషయంగా అనుకుని ప్రవర్తించినందువల్ల నేగదూ? నాగరాజు ఉద్యోగం చేసున్నాడా? హేమ అత్తారింటికిపోయిందా? అన్నయ్య పిల్లాపాపలతో హుందాగా ఉన్నాడా, నాన్న ఇష్టంవచ్చిన దగర నాదగ్గరతిప్ప హాయిగా ఉన్నాడా? ఇంకా వీళ్ళెందుకు పగబూనడం? మొత్తమ్మీద నేను అన్ని విధాలా నష్టపోయాను!' అంటూ నందకుమార్ రెండు చేతుల్లోకి తల తీసుకున్నాడు.

నాకు ఏమి చెప్పేందుకూ, చేసేందుకూ తోచలేదు. మౌనంతో, సిగరెట్ల పొగలు చేస్తున్న వలయాలు చూస్తూ కూర్చున్నాను.

ఎంతో సేపటికి బాగా ఆలోచించి, 'అయితే ఇప్పుడు నీకేమయింది నందా?' అంటూ అడిగాను.

'ఏమయిందా? ఇంకా ఏం కావాలి! నాకు ఒళ్లు బాగలేదు. కనే రోజులు శారదకు వచ్చాయి. వాళ్ళ అన్న రెండుత్తరాలు రాసినా, 'ఒళ్లు జాగ్రత్తగా చూసుకో! బరువు బిందెలు మోయకు! చితడి నేలలో తిరిగేప్పుడు తప్పక చెప్పులు ఉపయోగించు' అంటూ ఉచిత సలహాలు ఓలిఘకు ఇచ్చాడు, కానీ 'వస్తున్నాను తీసుకవెళతాను' అంటూ రాయలేదు! తొలిమోలుకాదా, ఆపాటిజ్ఞానమూ లేకపోయింది! ఆస్పత్రి కాన్పుకు శారద ఇష్టపడలేదు. అందువల్ల తీసుకవచ్చాను. నాగరాజు మమ్మల చూసి పలుకులేక బజారుకు వెళ్ళిపోయాడు. నాన్న ఇంట్లో లేడు! ఎప్పుడు వస్తాడో తెలీదు.'

'శారదను ఇక్కడకు తీసుకవచ్చావా?'

'ఏమి చేయమంటావ్? అంతకన్నా గత్యంతరం లేకపోయింది. నా ఆరోగ్యం తిన్నగా ఉంటం లేదు. ఎన్నిరావాలో అన్నీ వచ్చాయిరా తండ్రీ! ఇప్పుడు నాకో దారి చూడు!'

'ఎటు వేపుకు!'

'ఇప్పుడుకూడా హాస్యాలు సాగిస్తావేరా? ఒడునపడ్డ చేపలా గిలగిలాడుతున్నాను.'

'అయితే ఏం కావాలంటావు?'

'నాన్న అగ్నిహోత్ర మవుతాడు, గుగ్గిలం మల్లే నాగరాజున్నాడు! వాళ్ళిద్దరి కలయికను ఊహించుకుంటేనే భయంగా ఉంది.'

'ఇదంతా నీ ఊహ!'

'ఊహూం'

ఆ విధంగా వాడు ఊహించేందుకూ ఆధారం ఉంది. వాడిమీద ముఖ్యంగా ముసలాయన ఆశపడ్డాడు. వాడి పెండ్లి ఈ చేత్తో చేసి ఆ చేత్తోనే హేమనూ ఒకింటిదాన్ని చేయాలని ఆశపడ్డాడు.

చదువుతున్న చదువులో కొంచెం సాయం దొరకుతుందని నాగరాజూ పొంగిపోయాడు.

శారదను ఏమీ లేకుండా పెళ్లాడ్డంతో అందరి ఊహాలూ గాలికి చెదిరిపోయాయి!

కానీ, నాలుగేళ్ల తరువాత వచ్చిన నందకుమార్ మీద ముసలాయన ఇంకా కోపంగానే ఉంటాడా? ఇవాళ చలిమిడిముద్దలా చప్పగా అణగివచ్చిన వీడిని ఆయన క్షమింపకపోతాడా? అందులో ఆత్మీయత

చూపించాల్సింది అవసరంలో నే — అన్న విషయం ఆయనకు తెలీదూ?

'నీవు రాకూడదూ?' అంటూ నందకుమార్ మళ్ళీ అడిగాడు.

పెద్దమనిషిగా నన్నెందుకు వీడు రమ్మంటాడు' అయినా నావల్ల ఏంజరుగుతుంది?

పెద్దమనిషిగా నుంచోడానికి అందరూ తయారుగానే ఉంటారు. రిక్షావాడిమొదలు అందరూ పెద్దలే- తమ విషయాలు కానంతవరకు! పెద్దమనుష్యులకు చవుక అవుతున్న రోజులివి! నన్నూ ఓ పెద్దమనిషిగా నందకుమార్ నేటికి చేస్తున్నాడు!

సిగరెట్ కాలికాలి వేళ్ళను కాల్చివేస్తోంది, చప్పున వదిలివేశాను.

'ఏరా! నాకు సమాధానం? నాకా ఇంట్లో చోటులేకుండా పోయింది. కనీసం కనేంతకాలం చోటుకూడా వాళ్లు ఇస్తారో లేదో!'

'ఎంతఅయినా మీనాన్న! ఈ విషయం మరచి మాటాడుతున్నావు!'

'అదీ కండ్లారా చూద్దువురా!'

ఇద్దరమూ మౌనంగా అడుగులు సాగించాము.

గడపలో అడుగుపెడుతోంటే, చంద్రశేఖరయ్య మాటలు వినిపించడంవల్ల ఆగిపోయాను.

'ఏమ్మా? అయితే తొలిచూలుకూ తీసుకవెళ్లేందుకు రాలేదన్నమాట! చాలబావుందమ్మ! తల్లీదండ్రీ లేనిదానివి! ఆమాత్రం మీ అన్నకు బుద్ధిఉండఖర్లా! హూఁ పశువులు! జ్ఞానశూన్యులు!' అని ఆయన ఎందువల్లనో ఓ క్షణం ఆగాడు.

'హుఁ ఫరవాలేదు లేమ్మా! నీకు లేంవల్లా తల్లే! నేఉన్నాగా! నీ పెండ్లికి రాలేక పోయా! ఇవాళ నిస్సహాయంతో నా గుమ్మం తొక్కింది తండ్రివనే కాదూ! ఈ బంధాన్ని తెంపుకోవాలని అనుకోను. రేపుపోయి హేమను పిలుచుక వస్తాను.'

నేను నందకుమార్ వేపు చూశాను. వాడిముఖం నల్లగా తారు మల్లె అవుపడింది.

నేను లోపలికి అడుగులు వేశాను.

'ఓఁ రా నాయనా! రా! అవపడ్డంలేదే!' అంటూ ఆయన ఆహ్వానించాడు.

'ఉద్ధారకుడు ఏడీ కనపడలేదూ? ఇక్కడకొత్త చోటుకు ఒక్కరైనా తెచ్చి వదలి షికార్లు కొడుతున్నాడా?'

'ఇక్కడే ఉన్నాడండీ' అంటూ చుట్టూ చూశాను.

నన్ను చూసి శారద లోపలకు వెళ్ళింది.

నందకుమార్ ఎక్కడా కనపడలేదు. వంటింట్లో వాడి మాటలు వినిపిస్తున్నాయి. బహుశా దొడ్డితోవగుండా వెళ్ళి ఉంటాడు. ఈ ఇంట్లోకి వాడి ప్రవేశం సింహద్వారంలోంచి కాదన్నమాట!!

'నే వెళుతున్నా నమ్మాయ్! రేపు సాయంకాలంగానీ రాను' అంటూ కాళ్ళు చెప్పుల్లోఉంచి, గావంచా ఝూడించి 'హేమను పిలుచుక వస్తానోయ్! ఆమె కూడా వస్తే తోడుగా బావుంటుంది కదూ?' అని వెళ్ళిపోయాడు చంద్రశేఖరయ్య.

ఆ పితృ హృదయం ఎంత ఆర్ద్రమూ, కరుణామయమూ అయిందో చెప్పడం అలా ఉంచి, తండ్రి కాబోయే నందకుమార్ ఊహించుకోలేక పోవడం విచిత్ర మనిపించింది.

నందకుమార్ నవ్వుతూ ఇవతలకు వచ్చాడు.

'నీవు రాబట్టి అలా అయింది. లేకపోతేనా?' అంటూ వాడు తన పాత దురభిప్రాయాన్ని వదలిపెట్టలేదని తెలిపాడు.

'నేను రాబట్టి ఇలా జరిగిందా? నా ముఖమేనా చూడకుండానే, నీ భార్యను ఓదార్చిన ఉదారుడికి నా సలహాలు కావాలా? ఆయనలోమంచి నీకు కనబడ్డంలేదు. ప్రతి మాటనూ, చేతనూ విమర్శాత్మకదృష్టితో చూడ్డమే కారణ మనుకుంటాను. బహుశా, నిన్ను దూరంగా తరుముతున్నదీ నీతార్కిక బుద్ధే అంటూ తెలుసుకోలేక పోతున్నావు' అంటూ నేను పైకి అనలేను.

నిశ్చలంగా వాడి ముఖంలోకి చూస్తూ కూర్చున్నాను. 'అయితే మీబావ నామకరణానికయినా వస్తాడా?'

'ఓఁ తప్పకుండా! పాపం తీరిక చిక్కదుట.'

'నీభార్యను తీసుకవెళ్లంది తీరిక చిక్కకనేనా?'

'అబ్బె! ఏమయిందీ నిశ్చయంగా చెప్పడం కష్టం! ఉండు కాఫీ తెస్తాను' అంటూ ఆసంభాషణ పొడిగించడం ఇష్టంలేక వాడు లోపలకు వెళ్లాడు.

పాలేరు కుర్రాడు ఇంతలో ఓ గంపలో ఏవో సామాన్లు తెచ్చి, 'ఆముదం సీసా ఉందిట ఇస్తారా బాబూ! అమ్మగారికి ఇప్పుడే కావాలంటగా!' అడిగాడు.

'ఎవరు చెప్పార్రా?' అంటూ నందకుమార్ సీసా తెచ్చి ఇస్తూ అడిగాడు.

'పెద బాబు పాలెం పోతా చెప్పిండు!' అనేసి వాడు వెళ్లిపోయాడు.

* * * *

బట్టలు కొనేందుకు నందకుమార్ బజారుకు వచ్చాడు.

'పాదపూజలూ, ఎంత తల్లిదండ్రులు కాకపోయినా సాకారు గదూ, అంచేత వాళ్లకు చేయడం మర్యాదగా ఉంటుంది. తొలి కాన్పుకు ఇంటికి తీసుక వెళ్లలేని వాళ్లకు ఎందుకు పొమ్మంటాడు నాన్న! అన్నిటికీ ఇల్లా చిక్కులుగా ఉన్నాయి' అంటూ నందకుమార్ నిట్టూర్చాడు.

వాడికి ఆడపిల పుటింది!!

'మీ బావమరిది సకుటుంబంగా విజయం చేశాడా?'

'ఆఁ కాగు వేసుక వచ్చాడోయ్! అప్పుడే వరసలూ అవీ ఇవీ తిరగవేశారు. ఆయనకు నాలుగేళ్ళ కుర్రాడు ఉంటం తమాషాగా ఉందనుకో! వాళ్ళకంతా బటలు పెట్టడం మంచిదికదూ? మళ్ళీ మళ్ళీ మన ఇండ్లకు వస్తారా?'

'అవును! తీరిక చిక్కదు!'

'ఆఁ నేవస్తానోయ్!' అంటూ వాడు బట్టలంగడిలోకి దూరాడు.

నేను కంపెనీ వేపు నడక సాగించాను.

నాకీ పాద పూజల గొడవలూ, మర్యాదలూ తెలీవు. అయినా ఈ కాలంలో ఉన్నత స్థానమేనా, తిరగనంత ధనమేనా లేని ఎంత విలువగల్ల వాడికైనా గౌరవం జరగడం లేదు. లోకంలో గౌరవాలన్నీ వాళ్ళకే అయిపోతున్నాయి! అగ్ని తేజస్సుకు నివురు కప్పినట్లుగా ప్రకాశింపదగినవాళ్ళు గుప్తమే అయిపోతున్నారు. డాంబికులకూ అసత్యాచారులకూ, అత్యాచారులకూ వెలలేని గౌరవాలు ఎదురవుతున్నాయి!!

నేను ఇంట్లోకి అడుగుపెట్టేసరికి ఇల్లంతా గంభీరంగా ఉంది. ఎక్కడా అలికిడి వేయడం లేదు. బంధువులతో కోలాహలం కావాల్సిన ఈ ఇల్లు బోసిపోయేందుకు కారణం?

శారద పాపదగిర కూర్చుని చిచ్చికొడుతోంది. ఆమె కండ్లల్లో సంతోషం తృప్తితో కలసి మెరసిపోతోంది. మాతృత్వ గర్వంతో, ఓ చిన్ని ప్రాణశక్తి నులివెచ్చని స్పర్శతో కలుగుతున్న పులకలతో పారవశ్యంతో. ఆమె ఏవో లోకాల్లో ఉంది. ఆమె ధ్యానముద్రను నేనెంతమాత్రమూ భగ్నం చేయదలుచుకోలేదు. అది అవిచ్ఛిన్నంగా అమెకుండాలనే కోరుకుంటున్నాను!

ఆమె చప్పున తలఎత్తిచూసి సిగ్గుతో నుంచుంది.

'కూర్చోండి! వారు బయటకు వెళ్లారు. మామగారున్నారు పిలవనా?'

'ఎందుకూ? నందా ఎక్కడకు వెళ్ళాడు? ఆకుతోరణాలూ, గడపల పచ్చదనమూ కనిపిస్తోందే కానీ, కోలాహలం ఏమీ వినరాదే!'

ఆమె సన్నగా నవ్వి, 'మీకు తెలీదూ? మేనత్తగారింట్లో చేయాలని సంకల్పం! ఈ ఇల్లు చాలదని వారి భయం!' అంది.

'మీ అన్నయ్య సకుటుంబ సపరివారంగా విచ్చేశాడని వినికిడి! వారి దర్శనం...'

'ఎందుకు అంతగా కలవరిస్తున్నారు?'

'వారికి మీ మీద బాగా అపేక్ష ఉందని తెలిసింది. నందాను, బహుశా రాకెట్‌లో పెట్టి చాల పైకి తీసుక వెళ్ళబోతాడని విన్నాను.'

'అపేక్ష!' ఆమె భారంగా నిట్టూర్చింది. ఓ నిమిషం మౌనంతో గడిపి, 'ఎప్పుడు అమ్మానాన్నలు పోయారో, వాళ్ళ ప్రేమలు ఎంత చిక్కనివో తెలీనే లేదు. కానీ వీరిని చూసి పితృ హృదయం ఊహించుకో గలుగుతున్నాను.' అని ఆమె ముఖం చాటు చేసుకుంది.

'నిన్ను తీసుక వెళ్ళలేదని కోపంతో అన్నావు!'

'కోపగించుకోవాల్సిన మనుష్యులు కానప్పుడు ఎవళ్ల మీద కోపం?'

ఆశ్చర్యంతో ఆమె వేపునుండీ చూపులు పాప మీదకు మరల్చాను. పాప అన్నిటికీ అతీతంగా ఏదో లోకంలో ఉంది.

'చూస్తారుగా జరుగబోయే వింత!'

ఏమిటో అడగాలనుకుని నోరు తెరచేసరికి చంద్రశేఖరయ్య రానే వచ్చాడు.

'ఏం నాయనా? నుంచునే ఉన్నావు! వీడికి కాఫీ తెచ్చి ఇవ్వమ్మా!'

'ఇప్పుడేమీ వద్దు! తాగివచ్చాను!'

'అయినా తాగుదూ! తాగి ఓ పని చేసిపెట్టు నాయనా! చేస్తావా?'

తల ఊపాను.

'అయితే కొంచెం బట్టలు కొనుక్కురావోయ్! దంపతులకు సరిపడే బట్టలు! చీరెనుటుకూ లైట్ రోజ్ లో ఉండాలె. వంద రూపాయల్లో తీసుకో! మరో పంచెల చాపు పదిరూపాయలో ఒకటి తెస్తే చాలు!' అంటూ డబ్బు అందించాడు అతను.

"కోటా తగ్గించారే!"

"అంతే! అంతే! ఇదంతా కేవలం నటన! ఎందుకో ఆ భగవంతుడికే తెలుసు! నేనెవ్వరికీ అన్యాయం చెయబోవడం లేదని పరమేశ్వరుడు తెలుసుకుంటే నిశ్చింత" అంటూ ఆయన గబగబా వెళ్లి పోయాడు.

"తెర తీసినట్లు కొంచెం కొంచెం అర్థం అవుతూందా!" అంటూ శారద కాఫీ తెచ్చి అందించింది.

"ఊహుం నాకేం తెలీడం లేదు!"

"ఓ నాల్గు గంటలు పోనీయండి! ఈ మాట మీరు అనలేరు." అని ఆమె బలహీనంగా నవ్వింది.

కప్పు క్రింద ఉంచి బయటకు వచ్చాను.

పెద్ద పొట్లంతో అడుగు పెట్టే సరికి ఇల్లు కోలాహలంతో నిండుకుని ఉంది.

చంద్రశేఖరయ్య నన్ను చూసి నవ్వి, "గావంచాలు మరచాను చెప్పడం!" అన్నాడు.

"అవీ తెచ్చాను!" అంటూ పాకెట్ అందించాను.

"చీర లైట్ రోజులో దొరికింది కాదూ? హేమను సముదాయింపలేను."

"మీ రెందుకూ? ఆమె భర్త కూడా వచ్చాడాయె!"

నవ్వుతూ అతడు వెళ్ళిపోయాడు.

నామకరణానికి అంతా సిద్ధమవుతున్నారు. నందకుమార్ పెదాలమీద ఓ చిరునవ్వును అతికించుకుని ఆర్భాటంగా తిరుగుతున్నాడు. తండ్రి హోదాలోకి వచ్చాడాయె! అదెంతటి హోదానూ, సంతోషాన్నీ కలిగిస్తుందో కూడా నాకు తెలీదు!!

నందకుమార్ తన కూతురు పేరు ఎప్పుడో ఆలోచించుకుని ఉన్నాడులా ఉంది. అందుచేత అక్కడ ఎంతమాత్రమూ ఆలస్యం జరగలేదు. బియ్యపు పళ్ళెరంమీద ఒంటిరాతి ఉంగరంతో రాసి, ఆ పిల్ల చెవిలో ముమ్మారు చెప్పి నవ్వుకున్నాడు నందకుమార్!

శారద కూతురును చూస్తూ మురిసిపోతోంది.

నందుడి పెద్ద బావమరిది ప్రక్కనే నేను కూర్చుని ఉన్నాను. ఆయన కండ్లద్దాలు తీసి, కండ్లు నులుముకుంటూ నా వేపు చూసి, 'ఇవాల్టి సంతోషం రేపురాదు. వదలించుకునే నాటి కష్టం ఇవాళ ఊహకు చిక్కదు.' అన్నాడు.

'నిజమే! అయినా నందాకేం? మీరున్నారుగా! మేనరికం ఇహ కష్టమేముంది?'

ఆయన నవ్వబోయి ఎందువల్లనో ఆగి, 'అదయితే మంచిదే కానివ్వండి! రేపటి కాలం మంచిది కాదు! ఖచ్చితంగా నిశ్చయించే సాహసం నాకు లేదు! పిల్లాడు మనవాడయినా, వాడిమనస్సు మనది కాక పోవచ్చు!'

'మీ జ్యోతిషానికి ధన్యవాదాలు!'

మాటకూడా విని సహింపలేని ఈ లక్ష్మణరావు రేపు కొడుకు కన్నా ముందటికివచ్చి 'ఎన్ని వేలు?' అంటూ అడగడూ?

'మీకు పాదపూజలు జరుపుతారట వస్తారా?' అంటూ ఆయన శ్రీమతి పిలిచింది.

"ఓం పాదపూజ! ఎందుకూ? ఈ కాలంలోనూ ఉందా?" అంటూ ఆయన పకపకా నవ్వి, 'అయినా పూర్వాచారాలు గౌరవించి పాటించేవాళ్ళను చూస్తే మటుకు నాకు సంతోషం కలుగుతుందండీ!' అని లేచిపోయాడు.

హేమ మూతి ముడుచుకుని వెళుతోంది. ఆమె వెనకాలె ఆమెభర్త వెళుతున్నాడు. ఆ ఇద్దరూ సభలోంచి ఎందువల్ల 'వాకవుట్' అవుతున్నారో నాకు అంతు చిక్కలేదు.

రామదాసును ఆపి, 'ఎందుకూ ఇంత ఉరుకు?' అన్నాను.

'ఇంకా ఉండమంటావా? పురుడుపోస్తే ఆడపిల్లకు చీరఇచ్చే దోవలేదూ? తొలిమాలుకు ఇంటికి తీసుక వెళ్ళలేని పెద్దమనిషికి పాదపూజలట! వెళ్ళి,

ఆ కోష్టంలో ఉన్న దున్నపోతును చేయమనరాదూ? పెద్దరికం ఇస్తే, "పెట్టరా పిల్లికి పంగనామాలు!" అన్నట్టు'.

బహుశా ఇది శిశుపాలుడి పార్టీ అయి ఉంటుంది. ఈ కాలంలో ధర్మరాజు ఒకడుండి, రాజసూయ యాగం చేయాల్సివస్తే, పూజాసనం ఇవ్వాల్సిన సమయంలో తప్పకుండా శిశుపాలుడికి అగ్రాసనం ఇచ్చి గొల్లగపయ్యను చూసి పకపకా నవ్వేవాడు! ఇప్పుడిలాంటి దృశ్యాలు, సంఘటనలూ ఎన్ని జరగడం లేదని?

చంద్రశేఖరయ్యగ చప్పున అక్కడకు వచ్చి, 'మాశావూ! నేను అనుకున్నంతపనీ అయింది! బాబూ రామదాసూ! ఈ ఇలు వాది! నేనింకా ఉన్నాను. వాడివ్వలేదని కోపంతో వెళ్ళడం భావ్యమేనా? వాడి మర్యాదలా మీరు కోరుకునేది? నా మాట మన్నించవూ?" అనేసి, హేమ వెళ్ళినవేపుగా పరువెత్తాడు.

ఇంటల్లుడు నిర్ఘాంతపోయి నుంచున్నాడు. నాకు ఇదంతా చూస్తుంటే క్రొత్తగా ఒక సినిమా థియేటర్ లోకి వచ్చినప్పుడు నేలటిక్కెట్లకు జరిగే పోట్లాట జ్ఞాపకం వచ్చింది. మర్యాదకోసం అలకలూ, సాధింపులూ, మూతివిరుపులూ సాగిస్తున్నారు. అసలు మర్యాదను ఎంత చవుక చేస్తున్నారు? వీళ్ళకు మర్యాద విలువ తెలుసా?

హేమ చిరునవ్వుతో వచ్చి, 'ఎంతయినా మర్యాద జరక్కపోతే హృదయంభగుమంటుంది! వాడి పెళ్ళానికి ఎంత చాకిరిచేశాను కూలికి చేశానూ? అయినా వాడికి బుద్ధిలేదు. ఏదో రక్తస్పర్శగదా, అన్నయ్యగదా అని కాదూ చేసింది. ఆడపిల్లకు ఆ మాత్రం జరక్కపోతే, అందులో పెళ్ళాం తరఫు వాళ్ళకు జరుపుతూ మమ్మల్ని వెలివేయడంఎల్లా సహించడం? ఈయన ఇచ్చే చీరపాతతో నే జరుగుతోందా?' అంది.

'హేమా! నోరుసంబాళించుకోలేవూ? లోపలకు పోదాంపద!' అన్నాడు చంద్రశేఖరయ్య.

వాళ్ళు లోపలకు వెళ్ళారు.

నాగరాజు, 'మాశారా! ఆఫీసరయేసరికి ఎంత వినయమూ, భక్తీ మా అన్నయ్య ప్రదర్శిస్తున్నాడో? రేపు వాళ్ళు వీడివెత్తిన సిల్కుటోపా పెడతారు. ఇప్పటికే పెట్టారని నా అనుమానం!' అంటూ తన ఆక్రోశం వెళ్ళకక్కాడు.

పొద్దు అప్పటికే తిరిగిపోయింది. భోజనాల ప్రయత్నం ఎవరో చేయమొదలెట్టేసరికి అన్నీ కొంచెం వాయిదా వేయబడ్డట్లు అణిగిపోయాయి! భోజనాల దగర ఎవళ్ళకూ అభిప్రాయభేదాలు వచ్చినట్లు లేదు. వంట కూర్చిన మెప్పులే వినిపించాడు!

తాంబూలం సేవిస్తూ లక్ష్మణరావు నందకుమార్ తో మాటాడుతున్నారు. మేమూ ఆయన మాటలు వినేందుకు చేరాము.

నందకుమార్ అతి వినయంగా అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇస్తున్నాడు. ఆఫీసరు వారికి వాడి ప్రవర్తన అతిగా నచ్చినట్లుంది.

'వీరికి నేను చాల వాళ్ళమండీ అక్కడ ఓ మంచి చాన్సు ఇప్పిద్దామని ట్రై చేసున్నానండీ! ఏజ్ ఉంటే చాల తేలిక అయి ఉండేది. అయినా ఫరవాలేదనుకోండి' అంటూ లక్ష్మణరావు సన్నగా నవ్వి నావేపుకు తిరిగాడు.

నాగరాజు హఠాత్తుగా నోరు తెరిచాడు 'నాకు అన్నీ ఉన్నాయండీ! డిగ్రీలో ఒక క్లాసు కూడా వచ్చింది. అంతటి సమర్థులే అయితే నా విషయం కొంచెం చూడండీ! ఎంత చెడిపోయినా మీ బావమరది తమ్ముణ్ణే!' ఆఫీసరు కండ్లు ముడుచుకపోయాయి! నందకుమార్ కండ్లు ఒంతి నిప్పులయినాయి! నాగరాజు హేళనగా నవ్వసాగాడు.

ఎవరో వచ్చి చంద్రశేఖరయ్య నన్ను పిలుస్తున్నాడని చెప్పడంవల్ల వాళ్ళ ఇష్టాగోష్టిని వదలుకోవాల్సి వచ్చింది.

ముసలాయన దీనంగా కూర్చుని ఉన్నాడు. కొంచెం దూరంలో శారద పసిపాపతో, ఆయనవేపు హార్దంగా చూస్తూ కూర్చుని ఉంది. ఆమె మొన్నటివరకూ ఓ యువతి! ఇవాళ ఆమెలో ఎక్కడినుండీ వచ్చిచోటు చేసుకుందో మాతృవాత్సల్యం పాలపొంగులా తొణికిసలాడుతోంది. ఇంత స్పష్టంగా మాతృమూర్తి అయి ఉన్న ఆమె ఉదాత్తంగా నాకండ్లకు తోచింది. సహజంగా పిల్లలను కన్న స్త్రీమూర్తి హృదయం నవనీతమై, పూర్వభావాలు అదుముబడతాయి కాబోలు! ఇల్లాంటి స్వరూపం ఆమెలో మును పెప్పుడూ చూళ్ళేక

పోయాను. స్త్రీని మాయాశక్తి అంటారే, అదివాస్తవమే!!

"చూడు నాయనా! ఈ కలకలం ఎల్లా శాంతించాలో నాకు తోచడములేదు. హేమ భర్త గునుస్తూనే ఉన్నాడు. ఆయనకు దొడ్డిత్రోవంట మర్యాదలు జరిగాయట! ఇంత ఖర్చుకు నాగరాజు నాగరాజే అయి బుస్సలు కొడుతున్నాడు. ఇంతకూ తండ్రినయిన నాకు మర్యాదలు జరగలేదు. అంతా నాదే! నాకేం జరిగేది? నటనకయినా నాకూ జరగడం ఉచితమే!" అంటూ చంద్రశేఖరయ్య భారంగా నిటూర్చాడు.

ముసలాయన ఆవేదన అర్థమయింది. తనకూ మర్యాదలు కొడుకుద్వారా జరగలేదని ఆయనదుగ్ధ! దీనికి నే నేం చేయగలను?

శారద నోరు తెరిచింది 'వాళ్ళకు దోచిపెట్టాలనే ఆరాటం ఆయన కెందుకు కలిగిందో తోచడము లేదు. తొలిమాలుకు ఇంటికి పిల్చుకుపోయి ఓ ముద్ద పెట్టాలన్న ఇంగితజ్ఞానం లేకపోయాక మనం ఇవ్వాల్సిన జరూరు ఏముంది? ఎవళ్ళకుండదు పుట్టింటి నుండీ మర్యాదలు పొందాలని? నేను పుట్టిల్లు లేనిదాన్నే అయ్యానుగా!'

'ఇప్పుడేం చేయాలంటావ్? ఇంక పదివాళ్లైనా హేమ ఉండదు. హేమ ఉండాలనుకున్నా అల్లుడు కోడెనాగులా బుస్సలు కొడుతున్నాడా, ఉంచడు! ఈమె విషయం ఎవళ్లు చూడాలె! కొంతకాలమేనా మరదలును వదిలిపెట్టి వెళతారేమో అడగరా అంటే నందా వినడం లేదు!'

ఇంతలో నందకుమార్ లోపలకు వచ్చి, 'ఏమిటి అతిసీరియస్ గా ఉన్నారు? చూశావా శారదా మీ అన్నయ్యవాళ్లు ఇప్పుడే వెళతారుట!' అన్నాడు.

'వెళ్లనివ్వండి!'

'అన్నయ్యమీద అలిగావా?'

'పుట్టినప్పటినుండీ లేదు!'

రంగంలోకి స్వయంగా లక్ష్మణరావుగారే అవతరించారు.

'రాత్రికి వెళతాం మామగారూ!' అన్నాడు లక్ష్మణరావు!

"ఏం శారదా! మేం వెళతామే! నాల్గు నాళ్లయినా సర్దాగా గడిపేందుకు శెలవులు దొరకలేదు. ఇప్పుడిప్పుడే నిన్ను కదలించడమూ అంతమంచిది కాదు. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోమ్మా! అన్నీ తెలుసు అనుకో! ఒకసారి మావూరు రండి నందకుమార్!' అంటూ అంతలోనే నావేపుకు అతడు తిరిగి 'రాత్రికి ప్రయాణం చేస్తామండీ!' అని పూర్తిచేశాడు.

మళ్ళీ నాగరాజు ఆఫీసరుకు సరి ఉద్దీ అని నిరూపించుకునేందుకు వచ్చాడు.

'వదినెర తోడుగా, మీ చెల్లెలిని నాలుగాళ్ళు ఉంచకూడదూ! రెండు మూడునెలలకు మీరే పిల్చుకపోవచ్చు! పసిపిల్లతో పాపం ఆమెఏంచేసుకుంటుంది?'

లక్ష్మణరావు గంభీరంగా నిట్టూర్చి 'ఆమెకు సమ్మంధాలు వస్తున్నాయి! పెండ్లిచప్పునచేసి భారం దించుకోవాలని ఆలోచన ఉంది!' నందకుమార్ కు ఆ సమాధానం కొంచెం కోపం కలిగించిందని, వాడి కళ్లే చెబుతున్నాయి! బావ వేపే నిశితంగా చూస్తూ, 'తొందరగా సామాన్లూ, అవీ, ఇవీ సర్దుకోండి బావా! మీ కాలస్యం అవదూ? కబుర్లతో ఎందుకూ పొద్దు పుచ్చుకోడం? పిల్లా జల్లా తెమిలేసరికి అస్తమానం అవుతుంది!' అనేశాడు.

లక్ష్మణరావుగారి భార్య అక్కడకు వచ్చి, 'కొంచెం పెందరాళే భోజనాలు తెమిలితే పొద్దుండగానే బయలుదేరదాం!' అంది. 'వంటవాడు వెళ్ళిపోయాడు. మళ్ళీ మరొకడిని పట్టుకవచ్చి వంట చేయించేసరికి పొద్దుపోవడం జరుగుతుంది!' అన్నాడు మళ్ళీ నందకుమార్!

ఈ మాటతో ఆమె మూతి ముడుచుకుని వెళ్ళిపోయింది,

'అయితే మేం ప్రయాణం చేస్తాం!'

'ఎంతో మంచిది!'

శారద నవ్వుతూ, 'తడిస్తే ముడిసె కప్పుకోడమూ, తాకిబొప్పి కడితే వంగి నడవడమూ మానవుల కంతా సహజమే! కానీ త్వరలో కండ్లు తెరవడమే కోరుకోవాల్సింది!' అంది.

లక్ష్మణరావు కుటుంబంతో కారు కదలిపోతూంటే, అందరూ బరువుదించుకున్నట్లుగా తేలిగ్గా చూస్తూ నుంచుండి పోయారు!